# ఆచారం

— హోతా పద్మినీదేవి

పరంధామ్ చనిపోయి ఆవేళ్టికి పది రోజులు. బ్రతికి వున్న పార్వతిని జీవచ్ఛవంలా బ్రతకమని నిర్దేశించినదీ ఆ రోజు నుంచే.

ఆ ఇంట్లో మూలగా సూర్యరశ్మి కూడా సోకని ఆ గదిలో కూర్చుని వుంది పార్వతి. ఘనీభవించిన శూన్యం! కరడుకట్టిన నిశ్శబ్దం! వేదన, రోదన ఆమె నేస్తాలు!

ఎప్పుడూ నుదుట ఎర్రని తిలకంతో పార్వతీదేవిలా వుండే ఆమె నుదట బొట్టు యివాళ శాశ్వతంగా తుడిచె య్యబడింది. మెడలో తాళి, నల్లపూ సలు, కాలి మెట్టెలు లేని ఆమె మంచు దెబ్బ తిన్న మల్లెపువ్వులా వుంది. విధి విసిరేసిన రెక్కలు తెగిన పావురంలా వుంది.

ఒక స్త్రీ జీవితంలో భర్త మరణం కంటే విషాదకరమైన ఉపసంహారం ఏం వుంటుంది?

పార్వతి తన దుస్థితికి తనలో తనే కుమిలిపోతోంది. ప్రస్తుత తన పరిస్థితి కంటే ప్రస్తుతం ఆమె నెక్కువగా బాధిస్తున్నది దప్పిక బాధ! తెల్ల వారు ఝామున ఎప్పుడో తులసమ్మ గారు ఇచ్చిన కాఫీ! కడుపులో ప్రేగులు ఆకలికి రొద చేస్తున్నాయి. పార్వతి ఎండిపోయిన పెదవులని నాలికతో తడిచేసుకుంటూ ఆలోచించసాగింది.

"ఇద్దరు-పిల్లలతో భర్తలేని సంసా రాన్ని ఎలా నెట్టుకురావాలి? పెద్ద కర్మ అయ్యాక ఎవరినైనా తోడు తీసు కుని భర్త పనిచేసే ఆఫీసులో ఏదైనా ఉద్యోగం ఇస్తారేమో అడగాలి! పిల్లలని చదివించాలి!"

భర్త పోగానే ఆత్మహత్య చేసుకోవా లనే కోరిక కలిగింది పార్వతికి. దుర్బల మైన మనసులో చచ్చిపోవాలనే కోరిక ఉధృతమవుతుండగా, ఏదో పిరికితనం ఆ పని చెయ్యనివ్వలేదు. పిరికితనం అనేకంటే పిల్లలపై మమకారం అంటే బాగుంటుందేమో!

పిల్లలు గుర్తురాగానే పార్వతి కళ్ళలో నీళ్లూరాయి. "పిల్లలు అమ్మకావాలని ఏడుస్తున్నారేమో! పెద్దపిల్ల ఫర్వాలేదు. ఎవరేం చెప్పినా వింటుంది. రెండోదే మరీ చంటిపిల్ల! తన కోసం ఏడు స్తుంది.' '

"ఇంకెంత? మరో గంట గడిస్తే తను వున్న ఈ గది తలుపులు తెరుస్తారు. తన పిల్లలని తన దగ్గరకి చేరుస్తారు. అటు నుంచి ఇటు తిరగబోయిన పార్వతి గుండెల్లో కలుక్కుమంది.

ఎడమవైపు ఛాతీలో సన్నగా నెప్పి మొదలయింది. గత నాలుగు నెలలు గాఆ గుండెనెప్పికి వైద్యం చేయించు కుంటున్న పార్వతికి మందు బిళ్ళలు ఆ గదికి అవతలి వైపున్న తమ గదిలో వున్నాయని తెలుసు. "ఎవరిని పిల వాలి? ఎవరిస్తారు తనకి మందు? భర్త మరణించినప్పుడు వచ్చిన గుండెనెప్పితో తన ప్రాణం పోతే బాగుండునని మన స్ఫూర్తిగా కోరుకుంది. ఇప్పుడు నిజం గానే తను చనిపోతుందా?" పార్వతి వెన్నులో సన్నని జలదరింపు.

పరంధామ్ మరణానికి బావురుమని ఏడ్చే బంధువులు ఎవరూ లేరు ఆ ఇంట్లో. కాని ఫ్రీగా వస్తే ఫినాయిలైనా తాగగలిగే రాబందుల లాంటి బంధు వులు వున్నారు. ప్రస్తుతం వాళ్ళంతా వంటగదిలో ఉప్మా గుండిగ చుట్టూ వున్నారు.

పార్వతి గుండెని చేత్తో అదుము కుంది. సన్నగా మొదలయిన నెప్పి క్షణ క్షణానికి ఉధృతమవసాగింది.

"తను చావకూడదు. బ్రతకాలి. పిల్లలు... తన పిల్లలు... ఆక్రోశిస్తోం దామె మనసు. బాధతో మెలికలు తిరుగుతోంది.

'పిన్నీ! తులసమ్మ పిన్నీ!' ఆ పిలుపు ఆమె స్వరం నుంచి ఆక్రందనలా ధ్వనిస్తోంది.

ఇంకెవరిని పిలిచినా ఆ గదిలోకి ఎవరూ రారని తెలుసు పార్వతికి. దురదృష్టవశాత్తూ బంధువర్గంలో తుల సమ్మగారు తప్ప హితంతువు లెవరూ లేరు.

మంచి ఘడియలలో తప్ప పార్వతిని ఎవరూ చూడకూడదు అనే ఆచారం వుంది మరి!

పార్వతి మరింత గట్టిగా తులసమ్మ గారిని పిలవాలని నోరు తెరిచింది. కాని, ఆమె నోటి నుంచి పిలు పుకి బదులుగా బాధని భరించలేని ఆర్తనాదం వెలువడింది. కళ్ళ ముందు మృత్యుదేవత వికటాట్టహాసం చేస్తూ కనిపించింది. ప్రాణం పోవడం తెలు స్తూనే వుంది.

గది తలుపులు తెరిచి, ఒక్కొక్క రుగా ఆ గదిలోకి వచిచన ముత్తైదు వలు నిర్జీవంగా వున్న పార్వతమ్మని చూసి నివ్వెరపోయారు.

"ప్రాణం వుందేమో చూడండి. డాక్టర్ దగ్గరకి తీసుకెళ్దాం."

"ప్చ్! లాభం లేదు. ప్రాణం పోయింది."

"ఎంత అదృష్టవంతురాలు! భర్తపో యిన రోజులు వెళ్ళకుండానే తనూ పోయింది."

"పోనీలే! వైధవ్య బాధను ఎక్కువ రోజులు అనుభవించకుండానే పోయింది."

"ఏ మందు మింగో చచ్చిపోయివుం టుంది! పిల్లల కోసమైనా బ్రతకాలను కోలేదూ?!"

వింటున్న పార్వతి ఆత్మ ఘొల్లున ఘోషించింది.

"నాకు బ్రతకాలని వుందర్రా! చని పోవాలని లేదు. నేను ఆత్మహత్య చేసుకోలేదు! అర్థంలేని ఆచారాలతో మీరే నా ప్రాణం తీసారు? మీరే నన్ను హత్య చేసారు."



## నేనొక రచయిత్రినికాను

నేనొక కవయిత్రినికాను,
అంతకన్నా రచయిత్రిని కానేకాను.
సమాజంలో ఒక మనిషిని,
ఆలోచనలతో సతమతమయ్యే
ఓ మనస్విని.

సకల మానవ సరిహద్దులను చెరిపేసి,
అంతరంగంలో పేరుకున్న
మమతల పడవకు తెరచాప కట్టి,
సందేహాల, సంతాపాల దొంతరల
అడ్డుగోడలను తొలిచేసి,
అపాయాలనే గుంటలను
ఉపాయాలనే ఇటుకలతో పూడ్చి
ముందుకు పయనిస్తున్న
ఓ మనిషిని.

నా కంటిముందు కన్పిస్తున్న
అర్ధనగ్న దృశ్యాలే
కడుపుమండే ఆకటిచిచ్చుల
హోరాహోరీలే
నిలవనీడలేక ఏ మూలనో
దాక్కునే పశువులకన్నా
హీనమైన బతుకుల గతుకులై
ఊరడిస్తూ
ఎన్నాళ్ళీ కష్టాల్
తీరని నష్టాల్
అందుకే అంటున్నాను

విషాదాగ్ని చల్లారాలంటే
నిరాశా నిస్పృహల దొంతరల్లో
రగిలే మానవుని ముఖానికి
మందహాసం పులమాలంటే
జీర్ణించుకుపోయిన
మనస్వార్థపు గోడలను
పగులగొట్టాలంటే
ఈ దురదృష్టజీవులను
మరో ప్రపంచానికి లాక్కెళ్దాం
ఈ వెల్తురు, ఈ చీకటిని
అధిగమించి
పురోగమిద్దాం
గమ్యానికి చేరుకొందాం.

—డా. వకుళాభరణం లలిత
*Hyderabad, AP*

## వినిపించేటంత

"డాక్టర్! నాకీమధ్య సరిగా వినబడటంలేదు. చివరికి నా దగ్గు నాకే వినిపించనంత చెవుడు వచ్చేసింది."

"అయితే ఈ టాబ్లెట్స్ రోజుకు రెండు చొప్పున వాడండి"

"అపుడు సరిగా వినిపిస్తుందా డాక్టర్!"

"కాదు. మీకు వినిపించేటంతగా దగ్గు వస్తుంది." – యామల సుహాసలక్ష్మి, బొబ్బిలి